క్లుప్తంగా

నేడు ఇసుక బహిరంగ వేలం

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) గ్రామశివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 70 ట్రాక్టర్ల ఇసుకను ఈనెల 12న మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. సీజ్ చేసిన ఇసుకకు శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు 50 శాతం డీడీ చెల్లించి గ్రామంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

25న హోలీ పండుగ

భైంసాటౌన్: పట్టణంలో ఈనెల 25న హోలీ పండుగ జరుపుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు సూచించారు. గురువారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమావేశమై మాట్లాడారు. వీహెచ్‌పీ జిల్లా కమిటీ, వేదపండితుల సూచనల మేరకు 24న ఆదివారం కామదహనం, సోమవారం హోలీ పండుగ జరుపుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, వేద పండితులు సుధన్వాచారి, శిరిస్ బెలే, నగర కార్యదర్శి పెరుగు నవీన్, లంక గంగాధర్, రాందాస్, రాజు, సంతోష్ గోపి, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భారతి

భైంసారూరల్: రక్తహీనత బారిన పడకుండా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. గురువారం మండలంలోని సుంక్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

డీఎల్‌పీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది, కోలాంగూడ గ్రామాల్లో గురువారం డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయినేజీలతోపాటు హరిత హారం నర్సరీలను పరిశీలించారు. వారి వెంట ఎంపీవో చంద్రశేఖర్, హన్మంతు, వెంకటరమణ, మహేశ్ తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో పూడికతీత

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో టవర్స్ కాలనీలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను గురువారం తొలగించారు. కౌన్సిలర్ పరిమి లతసురేశ్ సొంత డబ్బులతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి పూడికను తీయించారు. కాలనీలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ పేర్కొన్నా రు.

24న ఉచిత ధ్యాన శిబిరం

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీలోని చింతల్‌పేట్ గ్రామంలో విపశ్యన ధ్యాన కేంద్రంలో ఈనెల 24న ఉచిత ధ్యాన శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం నిర్వాహకుడు మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగవుతాయని.. 10 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం


నీరు అందిస్తున్న ఎంపీడీవో పుష్పలత

నర్సాపూర్(జి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పుష్పలత పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ బస్టాండ్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్, కారోబార్ గంగారాం పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

మామడ: వేసవిలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, వైద్యసిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనలో సవాళ్లు

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- గ్రామాల్లో ప్రత్యేకాధికారులకు తప్పని ఇబ్బందులు
- నాణ్యతాలోపంతో పనులు చేయిస్తున్నారని విమర్శలు


బీర్నందిలో పంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవికాలం జనవరి 31న ముగియడంతో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ప్రభుత్వం జిల్లాలోని 396 పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండలస్థాయి అధికారులను నియమించింది. అయితే బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులకు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు సవాళ్లుగా మారుతున్నాయి. వీటికి తోడు పంచాయతీల్లో నిధుల కొరత, వాహనాల నిర్వహణ తలకుమించిన భారమవుతోంది.

నిర్వహణపై తర్జనభర్జన..

పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరియాలనే ఆలోచనతో ప్రభుత్వం పంచాయతీకో ట్రాక్టర్, ట్యాంకర్‌ను ఈఎంఐ పద్ధతిన కొనుగోలు చేసింది. సర్పంచ్‌లు వాటికి ఈఎంఐలు చెల్లిస్తూ డీజిల్ కోసం ఎలాగోలా వెళ్లదీశారు. ప్రస్తుతం ఆ నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారులపై పడటంతో తర్జనభర్జన పడుతున్నారు. చిన్న జీపీల్లో కిస్తీలు, డీజిల్ ఖర్చులతో కుస్తీ పట్టే పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ పంచాయతీలకు తలకుమించిన భారంగా మారుతోంది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు సక్రమంగా రావడం లేదు.

అసంపూర్తి నిర్మాణాలు, భవనాల కొరత..

జిల్లాలో అనేక నూతన గ్రామపంచాయతీల్లో భవనాలు లేవు. కొన్ని చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు నిధులు విడుదల చేస్తే తప్ప నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితి లేదు. కొన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది.

పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏంటి..!

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. తమకు రావాల్సిన బిల్లుల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని తాజా మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల విషయమై కలెక్టరేట్‌తో పాటు మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. మరోవైపు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల్లో పాలన గడి తప్పకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

గ్రామస్తుల నిరసన..

ఖానాపూర్ మండలం బీర్నందిలో గతంలో పంచాయతీ భవనం మంజూరైనా స్థలం సరిపోక పనులు చేపట్టలేదు. అప్పట్లో భవన నిర్మాణానికి కనీసం 5 గుంటలు స్థలం ఉండాలన్న అధికారులే.. తాజాగా రెండు గుంటలు కూడా లేని పాతభవనం ఉన్న స్థలంలో ప్రత్యేకాధికారి అన్వర్ నిర్మాణానికి అనుమతించారు. దీనికి అనుమతులు ఎలా ఇస్తారని.. ఈ పనులు నిలిపివేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వీడీసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లిలో ఎన్ఆర్ఈఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయినేజీలు నాసిరకంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఏర్పాట్లు చేశాం. వీధిదీపాల ఏర్పాటు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లిస్తున్నాం. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు లేవు. ఇటీవల జరుగుతున్న అభివృద్ధిపనుల్లో నాణ్యత, ఇతర పనుల పర్యవేక్షణ బాధ్యత ప్రత్యేకాధికారులది కాదు. – రమేశ్, డీఎల్‌పీవో, నిర్మల్

సమస్యలను పరిష్కరిస్తున్నాం

గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నాం. కోలాంగూడలో పంచాయతీ భవన నిర్మాణ పనులు అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. – ఆసం రవి, ఎర్వచింతల్, కొలాంగూడ ప్రత్యేక అధికారి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్


సప్తాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. గురువారం మండలంలోని మొగ్లి గ్రామంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అఖండ హరినామ సప్తాహం కార్యక్రమాలు చేపట్టడం ద్వారా యువకులు ఆధ్యాత్మికత వైపు దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంపై గ్రామస్తులను అభినందించారు. బీజేపీ నాయకులు, సప్తాహం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీదేవి-భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వారి వెంట బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


శ్రీహరిరావును కలిసిన నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు కార్యకర్తలకు సూచించారు. పార్టీ నిర్మల్ మండల నూతన కార్యవర్గ సభ్యులు గురువారం తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా పార్టీ ఎవరికీ అవకాశం వచ్చినా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా వారి గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

నిధులు మంజూరుపై హర్షం

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం మాల సంఘ భవనానికి రూ.3లక్షలు, మాదిగ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ రాజనర్సింహరెడ్డి తెలిపారు. గురువారం నిధుల మంజూరుకు కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాల, మాదిగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


కడెం : లక్ష్మీపూర్‌లో టీకా వేస్తున్న సిబ్బంది

కడెం: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి విజయ్, డీఆర్వోలు సిద్ధార్థ, ప్రకాశ్, ఎఫ్‌బీవోలు అలీం, సూర్యానారాయణరాజు, సిబ్బంది తదితరులున్నారు.

అటవీ సంపదను రక్షించాలి

కుంటాల: అటవీ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అటవీ దినోత్సవం సందర్భంగా దౌనెల్లి అటవీ ప్రాంతంలో కుంటాల శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులకు క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, అనూష, వెన్నెల పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

తానూరు: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జి వైద్యురాలు రమ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తెల్లవారుజామున వెళ్లి ఉదయం 11గంటల్లోగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆశవర్కర్ల వద్ద మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌సింగ్, సూపర్‌వైజర్ అబ్దుల్ కాశీం, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘ సభ్యులు పలు సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో నాగరాజు, మల్లేశ్, రవీ, రవీందర్ తదితరులు ఉన్నారు.

పక్షులకు నీరు, ఆహారం అందించాలి


పాఠశాలకు బర్డ్ ఫీడర్ అందిస్తున్న వెంకటేశ్

తానూరు: ఎండలు పెరుగుతున్నందున ఇళ్ల పరిసరాల్లో పక్షులకు నీరు, ఆహారం అందించాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని భోసి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వేసవిలో పక్షులను కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. నిర్మల్ జిల్లాలో తిరుగుతూ పక్షుల సంరక్షణకు కృషి చేస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా బోథ్ గ్రామానికి చెందిన వెంకటేశ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలకు బర్డ్‌ఫీడర్‌ను అందించారు. అనంతరం వెంకటేశ్‌ను సన్మానించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న సీఈ కేఎన్ గుట్ట

దస్తురాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీఈ కేఎన్ గుట్ట సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. అంతరాయం ఉన్న చోట సాయంత్రం ఫీడర్ పరిధిలో ఎల్‌సీ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈదురుగాలుల సమయంలో అంతరాయం ఏర్పడితే సిబ్బంది వెళ్లి పునరుద్ధరించాలని పేర్కొన్నారు. టెక్నికల్ డీఈ బి.శ్రీనివాస్‌రావ్, ఏడీఈ కే.శ్రీనివాస్, సిబ్బంది చరణ్ దాస్, ప్రేమ్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

భైంసారూరల్: ఉపాధి పనుల కోసం జాబ్‌కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు అందేలా చూస్తామన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట కార్యదర్శి గాయత్రి, ఈజీఎస్ ఏపీఓ శివలింగం తదితరులు ఉన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి


సోన్‌లో మాట్లాడుతున్న సయ్యద్ మహమూద్

సోన్: పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలకు టెంట్, తాగునీరు, మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సయ్యద్ మహమూద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలం కేంద్రంతో పాటు మాదాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలన్నారు. కూలీలకు గడ్డపార, పార, తట్టలు పంపిణీ చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీలకు రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శాంతకుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

వట్టోలిలో బాధితులకు అండ

- అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన వారికి ప్రజాట్రస్టు చేయూత
- రూ.లక్షా ఇరవై వేలతో రేకులషెడ్డు నిర్మాణం


ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్డు


బాధిత కుటుంబసభ్యులతో మోహన్‌రావు పటేల్

లోకేశ్వరం: ఆపద వచ్చిందని అధైర్యపడొద్దని.. అన్నివేళలా మీ కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటామని మోహన్‌రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని వట్టోలి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన ఎగ్గం పెద్ద భూమన్న, సాయన్నల కుటుంబాలకు మోహన్‌రావు ప్రజా ట్రస్టు ఆధ్వర్యంలో రేకులషెడ్డు నిర్మించి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావుపటేల్ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ముధోల్ మాజీ ఎంపీపీ సుభాశ్ పటేల్, బీజేపీ నాయకులు గజ్వేరి భూమన్న, సాయినాథ్ పటేల్, సతీశ్‌రెడ్డి, కర్మెన డిపెన్న, రాజేశ్వర్, భోజన్న, లాలు, సాయన్నలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కుంటాల: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండలంలోని పెంచికల్‌పాడ్‌లో గురువారం రైతులు తమ పంట కుప్పల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,090 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు రూ.1980 నుంచి 2,040 వరకు అమ్ముకుంటూ నష్టపోతున్నామని వాపోయారు. మధుపటేల్, గోపాల్ పటేల్, గణేశ్‌పటేల్, కిష్టయ్య, రాంరెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ అష్టమ వార్షిక ఉత్సవాలు ఈనెల 26 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఖానాపూర్ గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆలయ ఆవరణంలో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుంచి 30వరకు జోగుఎత్తుట, 31న పోచమ్మకు బోనాలు, ఏప్రిల్ 1న గంగస్నానం, పుట్టధని, 2న రేణుక ఎల్లమ్మకు బోనాలతోపాటు రేణుకామాత-జమదగ్ని మహారాజ్ కల్యాణోత్సంతో ఒగ్గుకథ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సర్వే చేయాలని ఒత్తిడి చేయొద్దు


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఖానాపూర్: కుటుంబసర్వే చేయాలని అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి చేయవద్దని గురువారం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లు పనిచేయడం లేదన్నారు. నూతనంగా ఐపాడ్లు ఇచ్చేవరకు సర్వే చేయమని పేర్కొన్నారు. రోజు దినచర్య ఫొటోలు, ఎన్‌హెచ్‌టీఎస్‌లో వివరాలు నమోదు చేయాలని టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, గీతాంజలి, పద్మ, మునేంద్ర, రామలక్ష్మి, రేఖ, రాజేశ్వరి, సంధ్య, ప్రమీల, సత్యక్క తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వేసవిలో వడదెబ్బల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ శాఖల అధికారులు హాజరవుతారని.. సిబ్బంది సకాలంలో సమావేశానికి రావాలని కోరారు.

మహిళలకు శిక్షణ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామంలో గురువారం యాక్సెంచర్ ఈడీఐఐ ఆధ్వర్యంలో హౌస్‌హోల్డ్‌పై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హ్యాండ్ వాష్, ఫ్లోర్‌క్లీనర్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈడీఐఐ శిక్షకులు రజిత, దేవేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

భూగర్భజలాలు పరిశీలన

ఖానాపూర్: తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో గురువారం అధికారులు భూగర్భజలాలను పరిశీలించారు. జియోలజిస్ట్ సుహాసిని సిబ్బందితో కలిసి కాలనీకి వెళ్లి నీటి సమస్య పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రౌండ్ వాటర్ లెవల్ స్థాయి పరిశీలించామని.. నివేదికను అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో గురువారం గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

పెట్రోల్ పంపు స్థల పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామమైన నసీరాబాద్ శివారులో (61వ జాతీయ రహదారి పక్కన) సర్వే నంబర్ 671లో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాన్ని గురువారం తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్ పరిశీలించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. మధ్యాహ్న హారతిలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.